PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :148 | పేజీలు : 8 | వెల రూ.5 | శనివారం. 13.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన, తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS

## స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు..

### ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం



ప్రభాత సూర్యుడు: హైదరాబాద్ :
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ చేరవేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో విద్యాశాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు అందిస్తున్న వర్క్ బుక్స్ 2026-27 విద్యా సంవత్సరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైతం కొత్తగా వర్క్ బుక్స్ పంపిణీ చేయనున్నారు. అభ్యాసన సామర్థ్యాలు పెరగడానికి వర్క్ బుక్స్ ఉపయోగపడుతాయని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లోని (మిగతా 3లో..)


## పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో పూర్తి స్వేచ్ఛ ఉంది..

### సభకు అనుమతి నిరాకరణపై సీఎం రేవంత్ క్లారిటీ



ప్రభాత సూర్యుడు హైదరాబాద్ :
జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, తెలంగాణలో ఎవరైనా రాజకీయాలు చేయవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ పర్యటనలు, శాంతిభద్రతలు మరియు మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జూన్ 2వ తేదీన తెలంగాణలో పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై స్పష్టత ఇచ్చారు. కేవలం శాంతి భద్రతలను పరిగణలోకి తీసుకుని మాత్రమే పోలీసులు ఆ నిర్ణయం తీసుకున్నారని, దీని వెనుక ఎలాంటి రాజకీయ కారణాలు లేవన్నారు. “తెలంగాణలో పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది. ఆయనకు నచ్చినట్లు ఆయన రాజకీయాలు చేసుకోవచ్చు. ఇక్కడ ఎవరైనా పోటీ చేయడానికి అర్హులే” అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. (మిగతా 3లో..)

## హైదరాబాద్‌లో సందడి చేసిన రాజ్‌నాథ్ సింగ్



ప్రభాత సూర్యుడు హైదరాబాద్ :
కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం హైదరాబాద్‌లో సందడి చేశారు. నగర పర్యటనలో భాగంగా ఆయన జూబ్లీహిల్స్ పరిధిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులు, కీలక వ్యక్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ విజయాలు, దేశ రక్షణ రంగంలో సాధించిన పురోగతిని వివరించడంతో పాటు సమాజంలో వివిధ రంగాల ప్రముఖుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తుంది.

**సినీ, క్రీడా రంగాల ప్రముఖుల హాజరు..**

ఈ హై ప్రొఫైల్ సదస్సులో పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ స్టార్ క్రీడాకారుడు శ్రీకాంత్ కిదాంబి, ఒలింపిక్ షూటర్ ఇషా సింగ్ ఈ భేటీలో పాల్గొని రక్షణ మంత్రితో ముచ్చటించారు. దేశంలో క్రీడా రంగానికి కేంద్రం అందిస్తున్న మద్దతును ఈ సందర్భంగా వారు అభినందించారు. అలాగే టాలీవుడ్ యువ సంచలనం, ‘హనుమాన్’ ఫేమ్ నటుడు తేజ సజ్జా, వైవిధ్యభరిత చిత్రాల హీరో అడివి శేష్ లు రాజ్‌నాథ్ సింగ్‌ను ప్రత్యేకంగా కలిశారు. దేశభక్తి నేపథ్యంలో అడివి శేష్ నటించిన ‘మేజర్’ సినిమాను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. దేశ ప్రతిష్టను ప్రపంచవ్యాప్తంగా చాటడంతో క్రీడా, సినీ రంగాలు ఎంతగానో కృషి చేస్తున్నాయని కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఇటువంటి ప్రతిభావంతులను కలవడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు పాల్గొన్నారు.

## ప్రజాక్షేత్రంలో పర్యటించిన బండి సంజయ్

ప్రభాత సూర్యుడు హుస్నాబాద్ :



హుస్నాబాద్: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రజాక్షేత్రంలో పర్యటించారు. హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో పర్యటించిన అనంతరం, ఆయన కరీంనగర్ వైపు వెళ్లేందుకు స్థానిక ఆటోలో ఎక్కారు. ప్రయాణంలో భాగంగా ఆటో డ్రైవర్ దిలీప్‌తో ముచ్చటిస్తూ మోదీ పాలనపై ఆయన అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. “ఉచిత బియ్యం, గ్యాస్, రోడ్లు, గ్రామాభివృద్ధికి నిధులు ఇలా మోదీ పాలన పేదలకు ఎంతో మేలు చేస్తోంది” అని డ్రైవర్ పేర్కొనగా, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని సైతం బండి సంజయ్ ఆరా తీశారు.

**పాఠశాల ఆవరణలో ‘టిఫిన్ బైఠక్’**

అంతకుముందు రేకొండ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన బండి సంజయ్, ‘స్వచ్ఛ పాఠశాల’ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, కార్యకర్తలతో కలిసి పాఠశాల ఆవరణలో ‘టిఫిన్ బైఠక్’ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా బడులను (మిగతా 3లో..)

## ఎల్‌నినోపై భారత వాతావరణ విభాగం హెచ్చరిక

ఢిల్లీ :ప్రభాత సూర్యుడు



భారతదేశంలో ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌పై ‘ఎల్‌నినో’ ప్రభావం పడే అవకాశం ఉందంటూ భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. భూమధ్య రేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, దీనివల్ల అక్కడ స్పష్టమైన ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు అధికారికంగా వెల్లడించారు. ఈ పరిణామం రాబోయే రోజుల్లో దేశీయ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదం ఉందని ఐఎండీ ఆందోళన వ్యక్తం చేసింది. (మిగతా 3లో..)

## హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు: పొన్నం



ప్రభాత సూర్యుడు హుస్నాబాద్
సంక్షేమ శాఖల్లో అవినీతి జరుగుతోందంటూ మాజీ మంత్రి హరీష్‌రావు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో (మిగతా 3లో..)

## కిషన్ రెడ్డి రాజీనామా చేయాలి



### సీఎం రేవంత్ రెడ్డి

ప్రభాత సూర్యుడు హైదరాబాద్ :
సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తాజాగా మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంపై మాట్లాడుతూ.. కిషన్ రెడ్డిపై ఫైరయ్యారు. తెలంగాణ ప్రాజెక్టుల్ని అడ్డుకుంటోంది కిషన్ రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ఆయన వెంటనే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేసి.. ఆ పదవిని మరొకరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ కనుసైగ చేస్తే కిషన్ రెడ్డి డ్యాన్స్ చేస్తున్నారని, ఈటెల రాజేందర్ కు పేరు వస్తుందని మల్కాజ్ గిరిలో మెట్రో రైల్ ను అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల గురించి చెప్పాలని పలుమార్లు అడిగినా.. వారిదగ్గరి నుంచి స్పందన లేదన్నారు. మోదీకి కిషన్ రెడ్డి ఇప్పటివరకూ రాష్ట్రంలో ప్రాజెక్టుల పనులపై ఒక్క లేఖ అయినా రాశారా అని చిట్ చాట్ లో నిలదీశారు. IFSC నుంచి రావలసిన అప్పును కూడా కిషన్ రెడ్డే అడ్డుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు.. రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయడం లేదని దుయ్యబట్టారు.

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా..



ప్రభాత సూర్యుడు:హైదరాబాద్ :
తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకుని కుట్రపూరితంగానే వ్యవహరించిదని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో మీనాక్షి నటరాజన్ ఎంతో నిబద్ధత, నిజాయితీ కలిగిన మహిళా నాయకురాలని అన్నారు. అలాంటి లీడర్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్‌లో తిరస్కరించడం అత్యంత అన్యాయమని అన్నారు. తనకు తెలిసినంత వరకు ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, కోర్టుల్లో ఎలాంటి వివాదాలు పెండింగ్‌లో లేవన్నారు. కనీసం ఆమె రాజకీయ జీవితంలో ఎలాంటి నిరసనలు, రాస్తారోకోలు, రాజకీయ గొడవల్లో పాల్గొన్నట్లుగా కూడా రికార్డుల్లో లేదన్నారు. ఆమె వ్యక్తిగత జీవితంలోనూ ఎలాంటి చట్టపరమైన సమస్యలు లేకుండా.. అంతటి క్లీన్ రికార్డ్ ఉన్న నేతను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఈసీని ముందు పెట్టి రాజకీయం..**

మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కావాలనే ఎన్నికల సంఘాన్ని వాడుకుని మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా చేసిందని జగ్గారెడ్డి విమర్శించారు.

(మిగతా 3లో..)

## పోలీస్ శాఖ మానవత్వం..

### హోంగార్డుల కుటుంబాలకు రూ.38 లక్షల చెక్కు అందజేత

ప్రభాత సూర్యుడు హైదరాబాద్ :
తెలంగాణ పోలీస్ శాఖ మరోసారి మానవత్వాన్ని చాటుకుంది. కొద్ది రోజుల క్రితం ప్రాణాలు



కోల్పో యిన హోంగా ర్డుల కుటుం బాలకు రూ. 38 లక్షల చెక్కులను అందజేశారు. వివరాల్లోకి వెళితే.. విధి నిర్వహణలో ఉంటూ ప్రమాదవశాత్తు అకాల మరణం చెందిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ,
యాక్సిస్ బ్యాంక్ పెద్ద ఎత్తున ఆర్థిక సహాయాన్ని అందించి కొండంత అండగా నిలిచాయి. దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన సదరు హోంగార్డుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.38 లక్షల
చొప్పున ప్రమాద బీమా క్లెయిమ్ చెక్కులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ జ్జూ సజ్జనార్ స్వయంగా అందజేశారు.

(మిగతా 3లో..)

# కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్నిచ్చింది: పవన్ కళ్యాణ్



ప్రభాత సూర్యుడు తిరుపతి :
కూటమి గెలుపు ఏపీ సమాజానికి మళ్లీ ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చిందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తిరుపతిలోని దామినీడులో నిర్వహించిన కూటమి రెండేళ్ల పాలన సభలో ఆయన మాట్లాడుతూ.. 2024లో ప్రజలు భయాన్ని, అహంకారాన్ని తిరస్కరించారని అన్నారు. ప్రజలు మౌనంగా కనిపించినా అవసరం వచ్చినప్పుడు చరిత్రను మార్చగలరని నిరూపించారన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు ఇచ్చింది అధికారం కాదని, బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఈ విజయం కేవలం బీజేపీ, జనసేన, టీడీపీ పార్టీలది కాదని ప్రజల విజయం అని అన్నారు. ఈ కూటమి అధికారాన్ని పంచుకోవడానికి ఏర్పడింది కాకుండా బాధ్యతను పంచుకోవడానికి ఏర్పడిందని అన్నారు. కూటమిలో జనసేన 21 సీట్లు సర్దిపెట్టుకున్న సమయలో చాలా మంది విమర్శించారని చెప్పారు. కానీ తాము ఏపీ భవిష్యత్ కోసమే జనసేనను 21సీట్లకు పరిమితం చేశామని అన్నారు. వందశాతం స్ట్రైక్ రేట్ సాధించామని చెప్పారు. వ్యవస్థ బలహీనపడినప్పుడే ప్రాంతీయత ముందుకు వస్తుందని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం కులాల పరిమితులు దాటాలని, అందరూ భారతీయత వైపు వెళ్లాలని వ్యాఖ్యానించారు. గ్రామ సమస్యలకు పరిష్కారం గ్రామంలోనే వెతకాలని సూచించారు. ప్రజల జీవితాల్లో సమస్యలను ప్రజల్లోనే వెతకాలని అన్నారు. అందుకే గ్రామసభలను కేవలం అధికారిక సమావేశంలా కాకుండా గ్రామ ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువు కావాలన్నారు.

## కానిస్టేబుల్ పోస్టులు 20 వేలకు పెంచాల్సిందే..

ప్రభాత సూర్యుడు: హైదరాబాద్ :
హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా గుడి పరిసర ప్రాంతాలు శుక్రవారం ఉదయం తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను భారీగా పెంచాలంటూ వందలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు రోడ్డుపైకి వచ్చి అకస్మాత్తుగా ధర్నాకు దిగారు. కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 5 వేల నుండి 20 వేలకు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు, నిరుద్యోగ అభ్యర్థులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. రోడ్డుపై బైఠాయించిన అభ్యర్థులను పోలీసులు బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి పోలీస్ స్టేషను తరలించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది.

**5 వేల ఉద్యోగాలు ఎందుకు?**
ఈ సందర్భంగా నిరుద్యోగ సంఘాల నాయకులు, అభ్యర్థులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేవలం 5 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేస్తామని చెప్పడం నిరుద్యోగులను నట్టేట ముంచడమే" అని మండిపడ్డారు. ఏళ్ల తరబడి కోచింగ్ తీసుకుంటూ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న తమకు ఈ అరకొర పోస్టులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు.

## పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో పూర్తి స్వేచ్ఛ ఉంది..

**ఓట్ చోరీ అయిపోయింది.. ఇప్పుడు సీట్ చోరీ: బీజేపీపై ఫైర్**

(మొదటి పేజీ తరువాయి)

ఇదే సమయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, మధ్యప్రదేశ్ ఎన్నికల పరిణామాలపైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌ను బీజేపీ నేతలు ఆదర్శంగా తీసుకున్నట్లు కనిపిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై ఆయన మండిపడుతూ.. ఇది ముమ్మాటికీ కుట్రపూరిత చర్యేనని ఆరోపించారు. "మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. అయినప్పటికీ ఆమె నామినేషన్ను తిరస్కరించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. మధ్యప్రదేశ్‌లో రిటర్నింగ్ అధికారి పూర్తిగా తప్పుగా వ్యవహరించారు. దేశంలో మొదట ఓట్ల చోరీ జరిగింది.. ఇప్పుడు ఏకంగా సీట్ల చోరీకి పాల్పడుతున్నారు'' అంటూ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రోజంతా ఇంట్లోనే ఉంటావుగా.. ఏం చేస్తావు? అనేవారికి సుప్రీంకోర్టు చెంపదెబ్బ!



ఢిల్లీ :ప్రభాత సూర్యుడు
ఇంటి నాలుగు గోడల మధ్య ఏ రోజూ సెలవు లేకుండా, ఎలాంటి జీతం ఆశించకుండా అహర్నిశలు కష్టపడే గృహిణుల సేవలకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సముచిత గౌరవాన్ని కల్పించింది. ఇంట్లో మహిళలు చేసే సేవలు, పడే కష్టాలు వెలకట్టలేనివని, వారు కుటుంబం కోసం పడే శ్రమను కేవలం డబ్బుతో కొలవలేం అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా ఒక కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది.

**సుప్రీంకోర్టు కామెంట్స్**
రోడ్డు ప్రమాదంలో మరణించిన గృహిణి కుటుంబానికి చెల్లించాల్సిన బీమా పరిహారం కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కామెంట్స్ చేసింది. సాధారణంగా బీమా కంపెనీలు... ఉద్యోగం చేయని మహిళలు చనిపోతే, వారిని ఆదాయం లేని వారిగా చూపించి తక్కువ పరిహారం ఇస్తుంటాయ్.

**భీమా పరిహారం పెంచాలంటూ కీలక తీర్పు**
దీన్ని తీవ్రంగా తప్పుబట్టిన సుప్రీంకోర్టు, ఒక గృహిణి ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు చేసే పనులను లెక్కిస్తే, ఆమె ఒక మేనేజర్, చెఫ్, క్లీనర్, ట్యూటర్, నర్స్.. ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తుంది. కనీసం తక్కువలో తక్కువ నెలకు 30 వేల రూపాయల విలువైన పని చేస్తారని సుప్రీం లెక్కగట్టింది. కాబట్టి ఆమె శ్రమను ఉద్యోగుల జీతంతో పోల్చలేమని, గృహిణుల అంచనా ఆదాయాన్ని తక్కువగా లెక్కించడం చట్టవిరుద్ధం అని స్పష్టం చేస్తూ భారీ పరిహారాన్ని ఇవ్వాలని ఆదేశించింది సుప్రీం. 2001 నాటి కేసులో బీమా పరిహారం పెంచాలంటూ కీలక తీర్పు వెలువరించింది.

**గృహిణుల పాత్రపై సుప్రీం కోర్టు**
సుప్రీం కోర్టు మహిళల గురించి చేసిన కామెంట్లు, ఇచ్చిన తీర్పు, దేశ నిర్మాణంలో భాగస్వామి అంటూ చెప్పిన విషయాలు.. సమాజంలో విస్తృత చర్చకు దారి తీసింది. గృహిణులు ప్రత్యక్షంగా డబ్బు సంపాదించకపోవచ్చు. కానీ వారు ఇంట్లో పనులు చేయడం వల్లే పురుషులు బయటకు వెళ్లి ప్రశాంతంగా ఉద్యోగాలు చేయగలుగుతున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ నడవడానికి మహిళల కనిపించని శ్రమే మూలస్తంభం అన్న మాటను మర్చిపోవద్దు.

**365 రోజుల డ్యూటీ.. సెలవులే లేని గృహిణి జీవితం**
ఉద్యోగులకు వీకెండ్స్, పండుగ సెలవులు ఉంటాయ్. మరి గృహిణికి సంవత్సరంలో 365 రోజులూ డ్యూటీనే. పండుగలు, పబ్బాలువస్తే ఆమెకు పని భారం మరింత పెరుగుతుందే తప్ప రెస్ట్ అనేదే ఉండదు. పిల్లల పెంపకం, అత్తమామలు, తల్లిదండ్రుల సేవ, వంట చేయడం, ఇల్లు సర్దడం వంటి పనులను మహిళలు కేవలం మెకానికల్ గా ఏదో బోరింగ్ గా కాకుండా ప్రేమ, బాధ్యతతో చేస్తారు. ఈ ప్రేమ ఆప్యాయతలకు రేటు కట్టలేం. ఎంత ఇచ్చినా తక్కువే అన్నది అంతా గుర్తుంచుకోవాలన్న చర్చ జరుగుతోంది.

**రోజంతా ఇంట్లోనే ఉంటావుగా!**
ఇళ్లల్లో మహిళలు కష్టపడుతున్న తీరుపై చాలా సర్వేలు చాలా విషయాలను ఇప్పటికే చెప్పాయ్. భారత్ లో ఒక పురుషుడు రోజుకు సగటున కేవలం 30 నుంచి 40 నిమిషాలు మాత్రమే ఇంటి పనులకు కేటాయిస్తుంటే, మహిళలు సగటున 5 నుంచి 6 గంటల టైంను ఇంటి పనుల కోసమే కేటాయిస్తున్నారు. పైగా ఇంత చేసినా ఆమెకు గుర్తింపు దక్కట్లేదు. రోజంతా ఇంటి పనులతో ఎంత కష్టపడ్డా.. రోజంతా ఇంట్లోనే ఉంటావుగా, ఏం చేస్తున్నావు? అన్న ఒక్క మాటతో సమాజం, కొన్నిసార్లు కుటుంబ సభ్యులు కూడా ఆమె కష్టాన్ని నీరుగార్చేస్తున్నారన్న వాదన కూడా ఉంది. ఇక ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ఉద్యోగాలు చేసే మహిళల పరిస్థితి మరీ దారుణం. వారు అటు ఆఫీసు బాధ్యతలు చూస్తూనే, ఇటు ఇంటి పనుల భారాన్ని కూడా మోయాల్సి వస్తోంది.

**కనిపించని శ్రమకు గుర్తింపు కోరిన సుప్రీంకోర్టు**
సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు కేవలం బీమా పరిహారాలకే పరిమితం కాదు. ఇది సమాజంలో మేధోమథనానికి తెరలేపింది. ఇంటి పని అనేది కేవలం మహిళల బాధ్యత మాత్రమే కాదు, అది ఉమ్మడి కుటుంబ బాధ్యత అనే భావన పురుషులలో రావాలన్న మెసేజ్ సొసైటీలోకి బలంగా వెళ్తోంది. సుప్రీంకోర్టు చెప్పినట్లు, మహిళలు ఇళ్లల్లో చేసే సేవలను కేవలం ఉచితంగా చూడటం మానేసి, వారికి గౌరవం, గుర్తింపు ఇచ్చేలా అభిప్రాయాలు మారాలంటున్నారు.

## హరీష్ రావు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు: పొన్నం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. హరీశ్‌రావు అవగాహన లేకుండా మాట్లాడి తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నారని విమర్శించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మైనార్టీ, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలను వరుసగా మైనార్టీ, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన మంత్రులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పారదర్శకతను కాపాడేందుకు నిర్ణయాధికారాన్ని పూర్తిగా ప్రిన్సిపల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు అప్పగించామని చెప్పారు. నాణ్యత, పారదర్శకతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంటే, గత ప్రభుత్వంలో జరిగినట్లే ఇప్పుడు కూడా అవినీతి జరుగుతోందనే భ్రమలో హరీశ్‌రావు ఉన్నారని విమర్శించారు. గత పదేళ్లలో ఎంత అవినీతి జరిగిందో ప్రజలకు తెలుసని పేర్కొన్న ఆయన.. తాను, మంత్రి అజారుద్దీన్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలిసి స్పష్టంగా చెబుతున్నామని, సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీశ్‌రావుకు సూచించిన మంత్రి, పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆరోపణలకు ఆధారాలు లేకపోతే అలాంటి వ్యాఖ్యలను విరమించుకోవాలని హరీశ్‌రావుకు హితవు పలికారు.

## ప్రజాక్షేత్రంలో పర్యటించిన బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తాను ఇంటి నుంచి తెచ్చుకున్న సద్ది మూటను విప్పి, అందరితో కలిసి నేల మీద కూర్చుని అల్పాహారం చేయడం స్థానికులను ఆకట్టుకుంది.

**అభివృద్ధికి భరోసా**
పాఠశాల సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి, విద్యార్థుల డైనింగ్ కోసం రూ.5 లక్షలు, ప్రాథమిక పాఠశాల గదులు, కుల సంఘాల భవన నిర్మాణాలకు రూ.20 లక్షలు.. మొత్తంగా రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తానని హామీ ఇచ్చారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. కేంద్రం పిలుపు మేరకు రేపు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా 'స్వచ్ఛ పాఠశాల' నిర్వహించనున్నట్లు, సిరిసిల్లలో తాను స్వయంగా పారిశుధ్య పనుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్‌నినోపై భారత వాతావరణ విభాగం హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

**రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం**
ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఎల్‌నినో మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. సాధారణంగా ఎల్‌నినో ఏర్పడినప్పుడు పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల నీటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా ఉంటాయి. ఈ మార్పుల వల్ల భారతదేశానికి వర్షాలను మోసుకొచ్చే రుతుపవనాలు బలహీనపడతాయి. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం కూడా ఉందని ఐఎండీ నివేదికలు చెబుతున్నాయి.

**వ్యవసాయ రంగానికి దెబ్బ**
వర్షాలు తగ్గడం వల్ల దేశంలోని ప్రధాన రంగాలు దెబ్బతినే అవకాశం ఉంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలపైనే ఆధారపడే ఖరీఫ్ వ్యవసాయ సాగుపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. పంటల దిగుబడి తగ్గడంతో పాటు, రిజర్వాయర్లలో నీటి మట్టాలు క్షీణించి రాబోయే రోజుల్లో తాగునీరు, సాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు ఎదురుకావచ్చు. ఈ సవాలును ఎదుర్కొనేందుకు, ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ఐఎండీ నిరంతరం రుతుపవనాల పురోగతిని పర్యవేక్షిస్తూ, ముందస్తు ప్రణాళికలతో సిద్ధమవుతోంది.

## స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు..

(మొదటి పేజీ తరువాయి)

6 నుంచి 10 తరగతుల విద్యార్థులు సుమారు 12 లక్షల మంది వరకు ఉంటారు. అయితే వర్క్ బుక్స్ ఈ నెలాఖరు లేదా జులై మొదటివారంలో అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠ్యపుస్తకాలు ఇప్పటికే మండల కేంద్రాల నుంచి స్కూళ్లకు చేరుకోగా నోట్ బుక్స్ ఇంకా చేరలేదు. పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే పలు సూచనలు చేసింది.

**రోజువారీ పర్యవేక్షణకు ఆదేశాలు..**
పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ డీఈఓలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రవాణా, పంపిణీలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా రోజువారీ సరఫరా నివేదికలను ట్రాక్ చేయాలని స్పష్టం చేశారు. గతేడాది నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యార్థులతో కలిసి బుక్స్ ట్రాలీలో తీసుకొస్తుండగా బోల్తా పడింది. అందులో విద్యార్థులు ఉండడాన్ని విద్యాశాఖ సీరియస్‌గా తీసుకుంది. ఈ ఏడాది అలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని, పాఠశాల ప్రారంభం నాటికే బుక్స్‌తోపాటు అన్ని మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వంద శాతం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## పోలీస్ శాఖ మానవత్వం..

(మొదటి పేజీ తరువాయి)

**యాక్సిస్ బ్యాంక్ ఇన్సూరెన్స్ కవరేజీ..**
హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులు సయ్యద్ హుస్సేన్, సింహగిరి ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో మరణించారు. సయ్యద్ హుస్సేన్ నీటిలో మునిగి చనిపోగా, సింహగిరి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. అయితే, హోంగార్డుల సంక్షేమం కోసం పోలీస్ శాఖ తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ వల్ల వీరి వేతన ఖాతాలకు ప్రమాద బీమా కవరేజీ సదుపాయం ఉంది. దీంతో యాక్సిస్ బ్యాంక్ ఈ బీమా మొత్తాన్ని త్వరితగతిన మంజూరు చేసింది.

**బాధిత కుటుంబాలకు సీపీ భరోసా..**
బషీర్‌బాగ్‌లోని సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి సీపీ వీసీ సజ్జనార్ ఈ చెక్కులను పంపిణీ చేశారు. సయ్యద్ హుస్సేన్ భార్య రేష్మా బేగం, సింహగిరి భార్య భవానీలకు రూ. 38 లక్షల చొప్పున చెక్కులను అందించి, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారి కుటుంబాలకు తోడుగా ఉంటుందని గట్టి నమ్మకాన్ని ఇచ్చారు. లబ్ధిదారులకు క్లెయిమ్ త్వరగా అందేలా సహకరించిన యాక్సిస్ బ్యాంక్ అధికారులను ఈ సందర్భంగా సీపీ అభినందించారు.

## ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారాలా..

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని ముందు నిలబెట్టి, ఓ రకంగా తాము అనుకున్న కుట్రలో విజయం సాధించిందని అన్నారు. ఒక్క సీటు కోసం ఇంతలా దిగజారి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఏముందని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందంటూ సంచలన ఆరోపణలు చేశారు. విపక్ష నాయకులను టార్గెట్ చేయడానికి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారంటూ జగ్గారెడ్డి ధ్వజమెత్తారు.



# తమిళనాడు పొలిటికల్ సినిమా: లారెన్స్ మాస్టార్ సిద్ధమే కానీ.. త్రిష సంగతేంటి?



మరోవైపు లారెన్స్ ప్రకటనతో పాటే స్టార్ హీరోయిన్ త్రిష పొలిటికల్ ఎంట్రీపై కూడా తమిళనాట గుసగుసలు వినబడుతున్నాయి. తమిళ చిత్ర పరిశ్రమ (కోలీవుడ్)కు- రాజకీయాలకు దశాబ్దాలుగా విడదీయరాని బంధం ఉంది. ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి కాలం నుండి మొన్నటి విజయ్ కాంత్, నేటి దళపతి విజయ్ వరకు ఎంతో మంది సినీ స్టార్లు రాజకీయాల్లోకి వచ్చి తమ సత్తా చాటారు. ఇప్పుడు ఇదే బాటలో మరికొందరు అగ్ర తారలు రాజకీయ అరంగేట్రం చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా నటుడు, దర్శకుడు, సామాజిక సేవాకర్త రాఘవ లారెన్స్ తన పొలిటికల్ ఎంట్రీపై అధికారికంగా మనసులోని మాటను బయటపెట్టగా.. అదే సమయంలో సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ త్రిష రాజకీయ ప్రవేశంపై కూడా కోలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇది దేవకట్ట క్లారిటీ సాధారణంగా ఏ స్టార్ హీరో అయినా రాజకీయాల్లోకి వచ్చే ముందు అంతర్గతంగా ప్రణాళికలు రచిస్తారు. కానీ రాఘవ లారెన్స్ మాత్రం ఎవరూ ఊహించని విధంగా సరికొత్త పంథాను ఎంచుకుని... తన రాజకీయ భవిష్యత్తు నిర్ణయాన్ని నేరుగా ప్రజల చేతుల్లోనే పెట్టారు. ఆయన తన -ఎక్స్- (ట్విట్టర్) లో ఒక ప్రత్యేక వీడియోను షేర్ చేసారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా బాధ్యతను నమ్మకంగా నిలబెట్టాలంటూ నెటిజన్లను, తన అభిమానులను సలహా కోరారు. ప్రజలు కనుక వద్దు అని చెబితే తాను రాజకీయాల్లోకి రాకుండా తన ట్రస్ట్ ద్వారా సమాజ సేవకే పరిమితమవుతానని... ఒకవేళ ప్రజలు రమ్మని (ఎస్) చెబితే మాత్రం తాను రాజకీయాల్లోకి రావడానికి పూర్తిగా సిద్ధమని ఆయన ప్రకటించారు. త్వరలోనే ఎప్పుడు ఎవరితో కలిసి ప్రయాణం ప్రారంభించబోయేది కూడా వెల్లడిస్తానని లారెన్స్ స్పష్టం చేశారు. మరోవైపు లారెన్స్ ప్రకటనతో పాటే స్టార్ హీరోయిన్ త్రిష పొలిటికల్ ఎంట్రీపై కూడా తమిళనాట గుసగుసలు వినబడుతున్నాయి. దీనిపై త్రిష నుండి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోయినా.. కోలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం ... ఆమె రాజకీయ రంగప్రవేశానికి వేదిక సిద్ధమవుతోంది. ముఖ్యంగా తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త శకానికి తెరతీసిన -తమిళగ వెట్రి కళగం- (టీవీకే) అధినేత, తన సహనటుడు దళపతి విజయ్ వెంటే త్రిష నిలుస్తుండటం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. విజయ్ రాజకీయంగా విజయం సాధించాలని బలంగా కోరుకుంటున్న తొలి వ్యక్తి త్రిషనే కావడంతో భవిష్యత్తులో విజయ్ పార్టీ -టీవీకే-లో త్రిష చేరడం ఖాయమని.. అందులో ఆమెకు అత్యున్నత ప్రాధాన్యత కలిగిన పదవి దక్కే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో రాఘవ లారెన్స్... దళపతి విజయ్‌ల మధ్య ఉన్న సత్సంబంధాలు కూడా రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. ఇటీవల తమిళనాడు రాజకీయాల్లో విజయ్‌ను విమర్శించిన వారిని సముదాయించే ప్రయత్నం లారెన్స్ చేశారు. ముఖ్యంగా యాక్టర్ విశాల్.. దళపతి విజయ్‌ను ఉద్దేశించి కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేసినప్పుడు లారెన్స్ స్పందిస్తూ అందరూ సంయమనం పాటించాలని కోరారు. విజయ్ రాజకీయ ప్రస్థానానికి పరోక్షంగా మద్దతు ఇస్తూ వస్తున్న లారెన్స్... ఇప్పుడు తన అభిమానుల... ప్రజల అభిప్రాయాన్ని కోరుతుండటం చూస్తుంటే అతడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి మద్దతుగా నిలిచినా లేదా ఆ పార్టీలో భాగమైనా ఆశ్చర్యపోనక్కర్లేదనే టాక్ వినిపిస్తోంది.

## సామ్ 'బంగారం'.. రజినీ మూవీతో లింక్ ఏంటి?



అయితే తాజాగా దర్శకురాలు నందినీ రెడ్డి చెప్పిన ఓ విషయం ఆ సినిమాను మరింత హాట్ టాపిక్ గా మార్చింది. స్టార్ హీరోయిన్ సమంత, దర్శకురాలు నందినీ రెడ్డి కాంబినేషన్ అంటే ప్రేక్షకుల్లో స్పెషల్ ఇంట్రెస్ట్ ఉంటుంది. జబర్దస్త్, ఓ బేబీ తర్వాత వీరిద్దరూ కలిసి చేస్తున్న మూడో మూవీ మా ఇంటి బంగారం. జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానున్న ఆ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అయితే తాజాగా దర్శకురాలు నందినీ రెడ్డి చెప్పిన ఓ విషయం ఆ సినిమాను మరింత హాట్ టాపిక్ గా మార్చింది. మా ఇంటి బంగారంలో సమంత పోషించిన రోల్ ను కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ కెరీర్ లో సంచలన విజయాన్ని అందుకున్న బాషా సినిమా టెంప్లేట్ లో రూపొందించినట్లు నందిని రెడ్డి వెల్లడించారు. దీంతో ఒక్కసారిగా ఆ సినిమాపై చర్చ మొదలైంది. అయితే ఇది కేవలం మాస్ యాక్షన్ పాత్ర మాత్రమే కాదని ఆమె క్లారిటీ ఇచ్చారు. ఇది దేవకట్ట క్లారిటీ బాషాలో కనిపించినట్టు ఫ్యామిలీకి అండగా నిలిచే ధైర్యం, అవసరమైనప్పుడు పోరాడే తెగువ, తనలో దాచుకున్న మరో యాంగిల్ పాత్రలో ఉంటాయని పరోక్షంగా చెప్పారు. అంతేకాదు, సమంత పాత్రలో ఎమోషన్స్ కూడా చాలా స్ట్రాంగ్ గా ఉంటాయని తెలిపారు. బయటకు ధైర్యంగా కనిపించే ఆ పాత్రలో బాధ, ప్రేమ అన్నీ కూడా కనిపిస్తాయని చెప్పారు. అందుకే ఇది సమంత కెరీర్ లో అత్యంత వైవిధ్యమైన పాత్రల్లో ఒకటిగా నిలుస్తుందని వినికిడి. అయితే 1995లో విడుదలైన బాషా చిత్రం రజినీకాంత్ స్టార్ డమ్ ను మరో స్థాయికి తీసుకెళ్లింది. సాధారణ ఆటో డ్రైవర్ గా కనిపించే వ్యక్తి వెనుక ఉన్న పవర్ ఫుల్ బ్యాక్ గ్రౌండ్, కుటుంబం కోసం అతను చేసిన త్యాగం, అవసరమైనప్పుడు బయటపడే మాస్ అవతార్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇప్పటికీ ఆ సినిమా డైలాగ్స్, సీన్స్ అభిమానులను అలరిస్తూనే ఉంటాయి. అలాంటి చిత్రాన్ని గుర్తు చేసేలా సమంత పాత్ర ఉంటుందని నందిని రెడ్డి చెప్పడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఇక మా ఇంటి బంగారం చిత్రాన్ని సమంత తన సొంత నిర్మాణ సంస్థ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పై నిర్మించారు. రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి నిర్మాతగా వ్యవహరించారు. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి కీలక పాత్రల్లో నటించారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందించగా, ఓం ప్రకాష్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని యూ/ఏ సర్టిఫికెట్ పొందింది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, ఎంటర్టైన్మెంట్ ఎలిమెంట్స్ తో రూపొందిన ఆ చిత్రం ప్రేక్షకులు పెట్టే మనీకి, టైమ్ కు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తుందని మూవీ టీమ్ చెబుతోంది. ఇప్పటికే సమంత చీరకట్టులో చేసిన యాక్షన్ సీన్స్ పై ఆసక్తి నెలకొనగా.. ఇప్పుడు బాషా కంపేరిజన్ కూడా యాడ్ కావడంతో మా ఇంటి బంగారం మూవీపై అంచనాలు మరింత పెరిగిపోయాయి. మరి సినిమాలో సమంత ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో తెలియాలంటే జూన్ 19వ తేదీ వరకు ఎదురుచూడాల్సిందే.

## బాలయ్య మాటను నిజం చేసిన కుర్రాడు..

బ్రాహ్మణి పోస్ట్ వైరల్ భయంకరమైన క్యాన్సర్ మహమ్మారిని జయిం చడమే ఒక పెద్ద విజయం అయితే, ఆ తర్వాత తన నటన కలను నిజం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచాడు ఒక యువకుడు. భయంకరమైన క్యాన్సర్ మహమ్మారిని జయించడమే ఒక పెద్ద విజయం అయితే, ఆ తర్వాత తన నటన కలను నిజం చేసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచాడు ఒక యువకుడు. నందమూరి బాలకృష్ణ ఇచ్చిన ధైర్యంతో హాస్పిటల్ బెడ్ నుండి నేరుగా వెండితెర వరకు సాగిన ఆ కుర్రాడి ప్రయాణం ఇప్పుడు అందరినీ కదిలిస్తోంది. ఈ అద్భుతమైన జర్నీ వీడియోను నారా బ్రాహ్మణి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, అది కాస్తా నెట్టింట విపరీతంగా వైరల్ అవుతూ అందరిలో కొత్త స్ఫూర్తిని నింపుతోంది. ఆ వివరాలు ఇలా వున్నాయి..ఆసుపత్రి బెడ్‌పై బాలయ్య ఇచ్చిన మాట: కొన్నేళ్ల క్రితం ఒక చిన్న వయసు బాలుడు క్యాన్సర్ బారిన పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ సమయంలో బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ తరపున నందమూరి బాలకృష్ణ అతడిని పరామర్శించారు. కేవలం పరామర్శించడమే కాదు, ఆ పిల్లాడి కళ్లల్లోని నటన పట్ల ఉన్న ఇష్టాన్ని చూసి, "నువ్వు కూడా ఒకరోజు నాలాగే పెద్ద నటుడివి అవుతావు" అని గుండెలకు హత్తుకుని ధైర్యం చెప్పారు. ఇక బాలయ్య చెప్పిన ఆ మాటలు ఆ కుర్రాడి మనసులో బలంగా నాటుకుపోయాయి. మహమ్మారిపై గెలుపు.. కలల వైపు అడుగులు: కాలం గడిచింది, బాలకృష్ణ ఇచ్చిన కొండంత ఆత్మవిశ్వాసంతో ఆ కుర్రాడు క్యాన్సర్‌తో పోరాడి, ఆ మహమ్మారిని పూర్తిగా జయించాడు. కోలుకున్న తర్వాత తన లక్ష్యాన్ని అస్సలు మర్చిపోలేదు. నటుడు కావాలనే కలను నిజం చేసుకోవడానికి ఆడిషన్స్ ఇవ్వడం మొదలుపెట్టాడు. ఇక ఎన్నో కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. తెరపై మెరిసిన క్యాన్సర్ సర్వైవర్: చివరకు ఆ యువకుడి పట్టుదలకు ప్రతిఫలం దక్కింది. సినిమాల్లో నటించే గోల్డెన్ ఛాన్స్ సంపాదించుకున్నాడు. ఒకప్పుడు హాస్పిటల్ బెడ్‌పై ప్రాణాలతో పోరాడిన ఆ బాలుడు, ఇప్పుడు కెమెరా ముందుకు వచ్చి నటుడిగా మారడం చూసి ప్రతి ఒక్కరూ ఎమోషనల్ అవుతున్నారు. ఇక బాలయ్య నాడు నమ్మి అన్న మాటలను ఈ రోజు ఆ కుర్రాడు నిజం చేసి చూపించాడు. నారా బ్రాహ్మణి ఎమోషనల్ పోస్ట్: ఈ మనసుకు హత్తుకునే వీడియోను నారా బ్రాహ్మణి తన ఎక్స్ ఖాతాలో షేర్ చేస్తూ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. "ఇది చూసి నాకు చాలా సంతోషంగా అనిపించింది. ఒక యంగ్ బాయ్ తన ప్యాషన్‌తో కలను నిజం చేసుకోవడం నిజంగా అద్భుతం. అతడి కోరికలన్నీ నెరవేరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అంటూ బ్రాహ్మణి పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. బాలకృష్ణకు ఉన్న మంచి మనసు, ఆ యువకుడిలో ఉన్న గట్టి నమ్మకం కలిసి ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేశాయి. క్యాన్సర్‌తో బాధపడుతూ జీవితంపై ఆశలు కోల్పోయే ఎంతో మందికి ఈ యువకుడి సక్సెస్ స్టోరీ ఒక గొప్ప మెసేజ్ అని చెప్పవచ్చు. ఇక నటుడిగా మారిన ఆ యువకుడు భవిష్యత్తులో మరిన్ని ఎత్తులకు ఎదగాలని మనమూ ఆశిద్దాం.



## సింగ్ గీతం ప్రయోగంలో దేవిశ్రీ ప్రసాద్ కి స్పెషల్ అప్లాజ్!



తనదైన వినూత్న ప్రయత్నాలతో తెలుగు సహా తమిళ్ ఇంకా భారతీయ సినిమా దగ్గర అద్భుతమైన సినిమాలు అందించిన లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు గారి నుంచి పుట్టిన మరో ఆసక్తికర ప్రయోగమే "సింగ్ గీతం". తన 94 ఏళ్ల వయస్సులో దర్శకత్వం వహించిన ఈ యూనిక్ అటెంప్ట్ పైడ్ ప్రీమియర్స్ తో మంచి రెస్పాన్స్ అందుకుంది. అయితే ఇలాంటి ప్రయోగాత్మక చిత్రాన్ని పూర్తిగా సంగీతంతో ఎలివేట్ చేయడం అనేది మామూలు విషయం అయితే కాదు కానీ దానిని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ తన మార్క్ పనితనంతో రక్తి కట్టించడం చూసిన ఆడియెన్స్ నుంచి సాలిడ్ అప్లాజ్ తీసుకొస్తుంది. సినిమా మొదలైన కొన్ని నిమిషాల్లోనే మొత్తం మాటలు అన్నీ పాటలుగా మలిచి సంగీతంతో తీసుకెళ్లడం అనేది చిన్న కథేమీ కాదు కానీ దానిని దేవిశ్రీ ప్రసాద్ అలవోకగా హ్యాండిల్ చేసిన భావన కలుగుతుంది. దీనితో దేవిశ్రీ ప్రసాద్ అభిమానులు మాత్రం తన వర్క్ తో మరింత ప్రౌడ్ గా ఫీలవుతున్నారు.

## 'ఓజి' క్రేజ్ కి ఇది మరో నిదర్శనం.. ఇదేమి మాస్ రీచ్!



తెలుగు రాష్ట్రాల్లో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి ఉన్న భారీ ఫాలోయింగ్ కోసం కానీ క్రేజ్ కోసం కానీ ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తనకి సరైన సినిమా పడితే దాని ప్రభావం ఎలా ఉంటుందో తన సినిమా 'ఓజి' చూపించింది. దర్శకుడు సుజీత్ తో చేసిన ఈ సినిమా ఎన్నో అంచనాలు నడుమ వచ్చి భారీ ఓపెనింగ్స్ రాబట్టింది. అయితే కంటెంట్ కూడా ఇంకా స్ట్రాంగ్ గా ఉండి ఉంటే మరింత లెవెల్లో వసూళ్లు వచ్చి ఉండేవి కానీ అభిమానులు పూర్తిగా ఈ సినిమాకి తమ హీరో పేరిట ప్రతీ రూపాయి అందించారు. అయితే పవన్ చేస్తున్న చేయనున్న సినిమాల అన్నీ ఒకెత్తు అయితే ఒక్క ఓజి క్రేజ్ మరో ఎత్తు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. సినిమా ప్రొడక్షన్ సంస్థల నుంచి చిన్నపాటి అప్డేట్ ఓజి పై వచ్చినా టీం మాట్లాడినా సోషల్ మీడియాలో దీని రీచ్ ఊహించని లెవెల్లో ఉంటుంది అని చెప్పాలి. మొన్నామధ్య డీవీవీ సంస్థ జస్ట్ చిన్న ట్వీట్ చేస్తేనే మిలియన్స్ ఇంప్రెషన్స్ వచ్చాయి. ఇక లేటెస్ట్ పవన్ నిర్మాణ సంస్థ నుంచి ఆకస్మికంగా వచ్చిన ఓజి 2 అప్డేట్ సోషల్ మీడియాని షేక్ చేసి పారేసింది. ఇలా ఓజి క్రేజ్ మాత్రం మామూలు లెవెల్లో కొనసాగడం లేదని చెప్పాలి. ఇక మేకర్స్ ఈ సినిమాపై ఎలాంటి అప్డేట్ అందిస్తారో చూడాలి.

## విశాల్ 'మకుటం' టీజర్.. మొదటిసారి ఇలా..




సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించగా.. తాజాగా వచ్చిన టీజర్ యాక్షన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ కెరీర్ లో స్పెషల్ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతున్న చిత్రం మకుటం. హీరోగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ విశాల్ మొదటిసారి బాధ్యతలు చేపట్టిన ఆ సినిమాపై ఆడియన్స్ లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ పై రూపొందుతున్న మకుటం మూవీ ఆ సంస్థకు 99వ ప్రొడక్షన్ ప్రాజెక్ట్ కావడం మరో విశేషం. అయితే తాజాగా విడుదలైన టీజర్ సినిమాపై ఉన్న హైప్ ను మరింత పెంచింది. సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించగా.. తాజాగా వచ్చిన టీజర్ యాక్షన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. మండుతున్న శవం దగ్గర ప్రశాంతంగా సిగరెట్ వెలిగించుకుంటూ విశాల్ ఇచ్చిన ఎంట్రీ టీజర్ కే హైలైట్ గా నిలిచింది. ఆ ఒక్క సీన్ తోనే సినిమాలో ఉండబోయే ఇంటెన్సిటీ, మాస్ ఎలిమెంట్స్ ను డైరెక్టర్ పరిచయం చేశారు. మకుటం టీజర్ లో విశాల్ మూడు భిన్నమైన గెటప్స్ లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఓ పాత్రలో వయసు మళ్లిన గ్యాంగ్ స్టర్ గా, మరో రోల్ లో స్టైలిష్ లుక్ తో, ఇంకో పాత్రలో కామన్ పర్సన్ గా కనిపిస్తూ ఇంట్రెస్ట్ క్రియేట్ చేశారు. అయితే మూడు పాత్రల మధ్య ఉన్న సంబంధం ఏమిటి? కథ ఎలా సాగనుంది? అనే ప్రశ్నలను టీజర్ రేకెత్తిస్తోంది. దర్శకుడిగా విశాల్ చూపించిన విజువల్ ప్రెజెంటేషన్ కూడా ఆకట్టుకునేలా ఉంది. యాక్షన్ సన్నివేశాలను స్టైలిష్ గా తెరకెక్కించడంతో పాటు కథలోని అసలు మిస్టరీ బయటపెట్టకుండా ఇంట్రెస్ట్ ను కంటిన్యూ చేశారు. దీంతో దర్శకుడిగా విశాల్ తొలి ప్రయత్నం విజయవంతంగా ఉండొచ్చనే అభిప్రాయం ఇప్పుడు సినీ ప్రియుల్లో వ్యక్తమవుతోంది. ఇక నటి అంజలి పాత్ర కూడా టీజర్ లో ప్రత్యేకంగా నిలిచింది. నోట్లో కత్తి పెట్టుకుని ఫైట్ కు సిద్ధమవుతున్న షాట్ లో ఆమెను పవర్ ఫుల్ అవతార్ లో చూపించారు. ఇప్పటి వరకు కనిపించని మాస్ షేడ్ లో అంజలి కనిపించడం విశేషం. దుషార విజయన్ రోల్ కు సంబంధించిన కొన్ని సన్నివేశాలు కూడా చూపించి కథలో ఆమెకు కూడా ఇంపార్టెన్స్ ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. టెక్నికల్ గా కూడా మకుటం స్ట్రాంగ్ గా కనిపిస్తోంది. సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం నాథన్ అందించిన విజువల్స్ ప్రతి ఫ్రేమ్ ను రిచ్ గా నిలబెట్టాయి. జీవీ ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ కు మెయిన్ అసెట్ గా మారింది. యాక్షన్ సీన్స్ లో బీజీఎం ఇచ్చిన ఎలివేషన్ ఆకట్టుకుంటోంది. ఎడిటర్ ఎన్.బి. శ్రీకాంత్ టీజర్ ను ఇంట్రెస్టింగ్ గా మలిచారు. జి. దురైరాజ్ రూపొందించిన ప్రొడక్షన్ డిజైన్ మూవీ వరల్డ్ ను మరింత గ్రాండ్ గా చూపించింది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555